క్లుప్తంగా

పూడికల తొలగింపు



బీఆర్‌టీఎస్ రోడ్డులో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారి వెంబడి కాల్వల్లో పూడికలు తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు పూడికల తొలగింపు పనులను సుమారు మూడు నెలలుగా చేస్తున్నారు. ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. అయితే మురుగు నీటితో ఉండడం వల్ల రోడ్డంతా అధ్వానంగా తయారవుతోంది. దీంతో త్వరితగతిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. 91వ వార్డులో పూడికలు తొలగించే పనులు త్వరగా పూర్తి చేయాలని వార్డు ప్రజలు కోరుతున్నారు. పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు పర్యవేక్షించారు.

డాక్‌యార్డ్ వర్క్స్ కమిటీ ఎన్నికల్లో ఐఎన్‌సీఈ విజయం



గెలుపొందిన సభ్యులతో ఐఎన్‌టీయూసీ నాయకులు

గోపాలపట్నం: విశాఖపట్నం మెటీరియల్ ఆర్గనైజేషన్ వర్క్స్ కమిటీ ఎన్నికల్లో నేవల్ డాక్‌యార్డు ఐఎన్‌టీయూసీ అనుబంధ యూనియన్ ఐఎన్‌సీఈ అఖండ విజయం సాధించింది. ఈ మేరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఏడీ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ నిరంతరం కార్మికుల శ్రేయస్సు కోసం పోరాటాలు చేసే యూనియన్‌కు కార్మికులంతా మద్దతుగా నిలిచారన్నారు. ఈ ఎన్నికల్లో 8 మంది సభ్యులు గల ఐఎన్‌టీయూసీ, ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ ప్యానల్ సభ్యులు నలుగురు ఆర్.శ్రీనివాసరావు, కోడి వెంకటేష్, పీవీఎస్ అప్పారావు, నిరంజన్ నాయక్ గెలుపొందారు. వీరి విజయంపై సంబరాలు జరుపుకొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ర్యాలీ



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్ : ఇజ్రాయిల్ దురాక్రమణను నిరశిస్తూ గ్లోబల్ సముద్ పోటిల్లాకు మద్దతుగా ఇండియన్ పీపుల్ ఇన్ సోలిడారిటీ విత్ పాలస్తీనా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సుజన్ మాట్లాడుతూ గత 23 నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 65 వేల మంది వరకు ప్రజలు చనిపోయారని, వారిలో 20 వేల మంది చిన్నారులే ఉన్నారన్నారు. మానవత్వంలేని ఇటువంటి దుశ్చర్యలను ఖండించాలని కోరారు. ప్రజలకు ఆహారం, మందులు అందించడానికి వెళ్తున్న నౌకా బృందంపై రెండు సార్లు ఇజ్రాయిల్ డ్రోన్‌లతో దాడులు చేసిందన్నారు. ప్రజలంతా సంఘటితంగా ఇటువంటి దుశ్చర్యలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబల్ సముద్ పోటిల్లాకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

సిరులతల్లికి తులసిపూజ




తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్కడ వెలుగు.. ఇక్కడ చీకటి

- వెలుగులకు చెట్ల కొమ్మలు అడ్డం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



వెలుగుతున్న లైట్లకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు



నేవల్ ఏరియాలో విరజిమ్ముతున్న వెలుగులు



సివిలియన్స్ ఏరియాలో అక్కడక్కడ కనిపిస్తున్న వెలుగు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వింత పరిస్థితి ఉంది.ఆఫీసర్లు ఉండే చోట ఒకలా.. సాధారణ ప్రజలు ఉన్న చోట మరోలా వసతులు ఉన్నాయి. ఓ సేవా మార్గంలో రాత్రి వేళ ప్రయాణం చేసినా వెలుగులు జిగేల్‌మంటున్నాయి. అదే ప్రాంతంలోని మరో మార్గంలో వెలుగులు అక్కడక్కడే కనిపిస్తాయి.

ఇదీ పరిస్థితి

జింక్ నుంచి సింధియా వరకు సేవా మార్గానికి ఇరువైపులా ఐదేళ్ల కిందట రోడ్డు విస్తరించారు. ఆ సమయంలో సేవా మార్గానికి మధ్య డివైడర్ ఏర్పాటు చేశారు. వాటి మధ్య పచ్చటి వాతావరణం కోసం చెట్లు పెంచారు. మధ్య మధ్యలో విద్యుత్ షో ల్యాంప్స్ ఏర్పాటు చేశారు. అయితే నౌసేనాభాగ్ నుంచి సింధియా పరిధి వరకు సేవా మార్గంలో చీకటి కనిపించదు. అదే మహాలక్ష్మి సినిమా థియేటర్ నుంచి జింక్ వరకు వెళ్లే సివిలియన్ అధికంగా ఉండే మార్గం మాత్రం అక్కడక్కడే వెలుగులు కనిపిస్తాయి.అక్కడ దట్టంగా చెట్టు కొమ్మలు పెరిగి విద్యుత్ షో ల్యాంప్స్‌కు అడ్డంగా ఉండటంతో ఆ మార్గం చీకటి మయంగా ఉంటుంది. దీనికి తోడు అక్కడక్కడ విద్యుత్ షో ల్యాంప్స్ పని చేయడం లేదు. నెలనెల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. అదే నేవల్ ఉద్యోగులు ఉండే నౌసేనాభాగ్ నుంచి సింధియా వరకు పగలు, రాత్రి ఒకే మాదిరిగా ఉంటుంది.

నేవల్ ఏరియాలో వెలుగు



నేవల్ పరిధిలో ఉన్న సేవా మార్గం రాత్రి వేళ కూడా వెలుగులు కురిపిస్తాయి. అదే మల్కాపురం,శ్రీహరిపురం ఏరియాల్లో ఆ వెలుగులు ఉండవు. సాధారణ ప్రజలు అధికంగా ఉండే సేవా మార్గంలో రాత్రి వేళ పలు చోట్ల అంధకారం నెలకొంటుంది. ఆ మార్గంలో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది.అధికారులుసమస్యపై స్పందించాలి. -ఎం.ఎస్.రాజు, వాహనదారుడు

చీకటి మార్గంలో తిప్పలు



మల్కాపురం ఏరియాలో విద్యుత్ షో ల్యాంప్స్ సరిగ్గా వెలగడం లేదు.కొన్ని చోట్ల వెలుగుతున్నా లైట్లకు చెట్టు కొమ్మలు అడ్డంగా ఉన్నాయి. దీంతోవెలుగు రోడ్డుపై పడడం లేదు. అధికారులు స్పందించి లైట్లకు అడ్డుగా ఉన్న కొమ్మలు తొలగించడంతో పాటు వెలగని లైట్లు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలి. -మురళీకృష్ణ, వాహనదారు

లైటింగ్ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సీతారామరాజునగర్ పార్కులో డెకరేటివ్ విద్యుత్ పనులకు శనివారం ఆ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు డెకరేటివ్ విద్యుత్ పనులు రూ.19.99 లక్షలతో చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్, శ్యామ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోషి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాము, రాజు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు.

లోక్ అదాలత్‌లో 540 కేసుల పరిష్కారం



బాధితునికి పరిహారం చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తులు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో రూ.4.66 లక్షల విలువైన 540 కేసులను న్యాయమూర్తులు రాజీ మార్గంలో పరిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని 13వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జీ.షణ్ముఖరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గమని అన్నారు. దీని వల్ల కక్షిదారుల మధ్య సత్సంబంధాలు ఉంటాయన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం నాలుగు బెంచ్‌ల ద్వారా న్యాయమూర్తులు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.వెంకట శేషమ్మ, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.యశోధర వేదమణి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 15ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్ విభాగంలో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యుడు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె.రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ప్రతిభకు చేయూత అవసరం



కళాకారులతో కమల్ బెయిడ్, గంట్ల శ్రీనుబాబు, తదితరులు

మద్దిలపాలెం : విభిన్న నృత్యాలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు కమల్ బెయిడ్ అన్నారు. జీవీఎంసీ 15వ వార్డు పరిధి సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నృత్య పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభకు చేయూత అందించి ప్రోత్సహించాలన్నారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా విశాఖ జిల్లా కళాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు వస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించక వెనుకంజ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిని స్వచ్ఛంద, సేవా సంస్థలు ప్రోత్సహించాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో తొలిరోజు వందలాది మంది విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శించారు. పలువురు కళాకారులకు అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. బీకే రామేశ్వరి, ఆర్.నాగరాజు పట్నాయక్, కొంద్రు రామారావు, సింహాద్రి రాజు, సి.సుజని, డాక్టర్ విజయవేణి, కె.సత్తిరాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ. విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్ పరం చేయడం వెనుక గల మతలబు ఏమిటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి. నడ్డా విశాఖ పర్యటనలో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, విభజన చట్టంలోని హామీలు అమలు చేస్తామని, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుండి ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఈ కార్యక్రమలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు, ఆర్. శ్రీనివాసరావు, కె. వనజాక్షి, ఎం.డి. బేగం, ఎం. మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్, ఎస్. నాగభూషణం, వై. రాంబాబు, ఎ. దేముడమ్మ, బి. పుష్పలత, కె. లక్ష్మణరావు, జి. జయ, ఎ. ఆదినారాయణ, పి. గోవింద్, జి. రాంబాబు, ఎం. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం హైదరాబాద్‌లోని మియాపూర్‌కి చెందిన పి.రాము లక్ష రూపాయల విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

ప్రతిభ వెలికి తీసేందుకే బాలోత్సవం



థింసా నృత్యంతో ఆకట్టుకున్న విద్యార్థులు

పెందుర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న విశేష ప్రతిభా పాటవాలను వెలికి తీయడమే బాలోత్సవం ఉద్దేశమని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. చంద్రశేఖర్ అన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కళాశాలలో బాలోత్సవం – 2025 కార్యక్రమం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు తొలి రోజు 23 అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. బాలోత్సవం జిల్లా కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ తొలి రోజు చిత్రలేఖనం, కథలు, కవితలు రాయడం, వ్యాసరచన, ఉత్తరం రాయడంతో పాటు శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక నాటికలు, గీతాలాపన, ఏకపాత్రాభినయం, ఫాన్సీ డ్రెస్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిరోజు హాజరైన 600 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి లలితా పీఠం ప్రతినిధులు భోజన సదుపాయం కల్పించారు. బాలోత్సవం ప్రతినిధులు పి.వి.రమణ, ఎ.చంద్రశేఖర్, ఉప్పాడ రాము, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్ కుటుంబానికి కార్పొరేటర్ పూర్ణిమ ఆసరా



బాధితుని భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: గాజువాక ప్రాంతానికి చెందిన హోమ్ గార్డు లక్ష్మణరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తక్షణం స్పందించారు. లక్ష్మణరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదును బాధితుని భార్యకు అందించడమే కాకుండా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మణరావు పూర్తిస్థాయిలో కోలుకోవాలని పూర్ణిమ ఆకాంక్షించారు. శనివారం కంచరపాలెం ఐదవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సమక్షంలో లక్ష్మణరావు భార్యకు కార్పొరేటర్ పూర్ణిమ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకుడు వేళంగి జీరావు, ఎస్ఐ భాస్కరరావు, సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాన మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకలి కేకలు వినపడడం లేదా?



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఉరుకూటి చందు

- వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చందు
- కార్మికుల పోరాటానికి సంఘీభావం

అగనంపూడి: జీతాల బకాయిల కోసం కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టనట్టు వ్యవహరించడం..., వారికి అధికారులు అండగా నిలవడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ కార్మికులు బకాయి పడిన జీతాలు చెల్లించాలని పది రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం చందు మాట్లాడుతూ యాజమాన్యం తన వైఖరి మార్చుకొని బకాయిలు చెల్లించడానికి ముందుకురావాలని డిమాండ్ చేశారు. ఏడాది పనిచేయించుకొని సగం జీతం చెల్లించడం వెట్టి చాకిరీ అవుతుందని, కార్మిక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అధికారులు ఈవిషయంలో ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానికేతరులకు ఉపాధిపై స్పందించాలి

కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబీకలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేయడానికి స్థానికులను కాదని స్థానికేతరులను చేర్చుకోవడంపై విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించాలని తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. రాష్ట్రేతర కార్మికులను చేర్చుకోవడానికి నిరసనగా ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు శనివారం ఉక్కు ట్రైనింగ్ విభాగం వద్ద ధర్నా చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది తమ కుటుంబీకులతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల భార్యలు తమ భర్తలను తొలగించడానికి కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి పని లేకపోతే ఇతర రాష్ట్రాల వారికి పని ఎలా దొరకుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీలు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధానకార్యదర్శి నమ్మి రమణ, నిర్వాసిత యూనియన్ నాయకులు భాస్కరరావు, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నోలో 15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ధర్మారావు తదితరులు

ఎంవీపీ కాలనీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఇగ్నో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 15 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ విశాఖ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఇగ్నో విశాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యాలయం పరిసరాలను శుభ్రపరచడంతోపాటు దత్తత గ్రామం అయ్యన్నపాలెంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇంటి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఇగ్నో ప్రతినిధులు పాల్గొన్నారు.